నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ మంగళవారం 6 మే 2025 | ADILABAD NIRMAL


ఆకాశంలో మబ్బులు రావడంతో ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు



## మొగులు.. గుబులు

*రైతన్న గుండెల్లో మొగులు గుబులు పుట్టిస్తున్నది. అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పంటలు పండించారు. కోతలు కోసి ధాన్యాన్ని ఆరబెట్టారు. ఆకాశం మబ్బులు పడడంతో ఆందోళన చెందుతున్నారు. వర్షానికి ధాన్యం తడిసి ముద్దయితే నష్టం వాటిల్లుతుందని ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉండడంతో తడవకుండా కవర్లు కప్పుతున్నారు. కేంద్రాల్లో తూకం వేగవంతం చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు.*

*- దస్తురాబాద్, మే 5*

ఉట్నూర్ దవాఖాన ఎదుట ఆందోళన చేస్తున్న సిబ్బంది




## వేతనాలు చెల్లించాలని..

*ఉట్నూర్ దవాఖానలో వైద్య సిబ్బంది సోమవారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పని చేస్తున్న సరైన సమయంలో వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటి వరకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు ఇవ్వలేదన్నారు. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది భాను, అమర్‌సింగ్, వెంకటేశ్, మొయిన్, అరుణ్, గంగాధర్, వీణ, యశోద, రమ, అంజలి పాల్గొన్నారు.*

*- ఉట్నూర్, మే 5*

## కంపించిన భూమి

ఖానాపూర్, దస్తురాబాద్ మండలాల్లో ప్రకంపనలు



భూమి కంపించడంతో బయటకు పరుగులు తీసిన గ్రామస్తులు

*ఖానాపూర్, దస్తురాబాద్ మండలాల్లో సోమవారం సాయంత్రం భూమి కంపించింది. ఖానాపూర్ మండలంలోని సూర్జాపూర్, పాత ఎల్లాపూర్ గ్రామాల్లో సాయంత్రం 6.55 గంటలకు భూమి కొన్ని సెకండ్లపాటు ప్రకంపనలను సృష్టించింది. దీంతో ప్రజలు ఇండ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. ఇళ్లలో రేకులు, కుర్చీలు కదలడాన్ని గ్రామస్తులు గమనించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదు. దస్తురాబాద్‌లో రాత్రి 7 గంటలకు రెండు సెకండ్లపాటు స్వల్పంగా కంపించింది. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో భూ ప్రకంపనలు వచ్చాయి.*

*- ఖానాపూర్/ఖానాపూర్ రూరల్/దస్తురాబాద్, మే 5*

## గొర్రెపై చిరుత దాడి

నర్సాపూర్(జీ), మే 5 : కుస్లి గ్రామానికి చెందిన సాయినాథ్ మరికొందరు గొర్ల కాపరులతో గోర్లను సోమవారం ఉదయం మేతకు తీసుకెళ్లాడు. తిరిగి సాయంత్రం గొర్లను తీసుకుని ఇంటికి వస్తుండగా చిరుతపులి గొర్రెపై దాడి చేసి మెడను పట్టుకుంది. దీంతో గొర్రెకు మెడభాగంలో గాయమైంది.



చిరుత పులి దాడిలో గాయపడిన గొర్రె

# పచ్చదనంపై పట్టింపేది?

- మొక్కల పెంపకాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కారు
- అధికారుల నిర్వహణలేక ఎండకు మాడుతున్న మొక్కలు



ఆదిలాబాద్ సమీపంలోని అంకోలి రోడ్డులో అటవీ శాఖ భూముల్లో ఎండిన మొక్కలు

ఆదిలాబాద్, మే 5(నమస్తే తెలంగాణ) : పచ్చదనం పెంపొందించడంతోపాటు పర్యావరణ రక్షణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఖాళీ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపుల, అడవులు, ఇంటి పరిసరాలు, చెరువులు, పొలాల గట్లపై మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించింది. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకం బాధ్యతను స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులకు అప్పచెప్పడంతో వారు ప్రత్యేక దృష్టి సారించి మొక్కలను కాపాడారు. పంచాయతీలు,

ఎండిపోయిన మొక్క



మున్సిపాలిటీలకు హరితనిధితోపాటు పచ్చదనం పెంపొందించడానికి పది శాతం నిధులను మంజూరు చేసింది. ఏటా వానకాలం సీజన్‌కు ముందుగానే నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టి అవసరమైన మొక్కలను సరఫరా చేసేలా బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హరితహారం కార్యక్రమంలో తీసుకున్న పకడ్బందీ చర్యల ఫలితంగా పచ్చదనం పెరిగింది.

### ఎండిపోతున్న మొక్కలు

హరితహారం కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో జిల్లా వ్యాప్తంగా 1.65 కోట్ల మొక్కలు నాటారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హరితహారం కార్యక్రమం పేరును వన మహోత్సవంగా మార్చింది. పెద్ద పంచాయతీల్లో 10 వేల మొక్కలు, చిన్న పంచాయతీల్లో 7 వేల మొక్కలు పెంచేలా చర్యలు చేపట్టారు. గతేడాది వానకాలంలో జిల్లా వ్యాప్తంగా 24.05 లక్షల మొక్కలు నాటాలని నిర్దేశించారు. ఈ ఏడాది 34.03 మొక్కల పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నారు. మొక్కలు నాటుతున్న అధికారులు వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో ఎండిపోతున్నాయి. మొక్కలకు రక్షణ కల్పించకపోవడం, నీరు పోయకపోవడంతో మొక్కలు పెరగడం లేదు. పంచాయతీలకు నిధుల కొరత కారణంగా నీరు అందించలేని పరిస్థితి నెలకున్నది. గ్రామ పంచాయతీలకు సరఫరా చేసిన ట్రాక్టర్లు, నీటి ట్యాంకర్ల చాలా పంచాయతీల్లో మూలన పడ్డాయి. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనంతో కోసం చేపట్టిన హరితహారం కార్యక్రమం విజయవంతం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

## పది ఫలితాల్లో అగ్రగామిగా నిలిచాం

ఎదులాపురం, మే 5 : అందరి సహకారంతో ఆదిలాబాద్ జిల్లా పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా 15వ స్థానం నుంచి 9వ స్థానంలో నిలిచిందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సన్మానించి, మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్, డీఐఈవో గణేశ్ పాల్గొన్నారు.

## నీట్ సరిగా రాయలేదని ఆత్మహత్య

ఉట్నూర్, మే 5 : మండల కేంద్రానికి చెందిన రాయ్ మనోజ్ నీట్ పరీక్ష బాగా రాయలేదనే మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు, పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని అంగడిబజార్ మెయిన్ రోడ్డులో నివాసముంటున్న ఉపాధ్యాయుడు రాయ్ గంగాధర్ కుమారుడు రాయ్ మనోజ్(19) లాంగ్‌టర్మ్ కోచింగ్ హైదరాబాద్‌లో తీసుకున్నాడు. నీట్ పరీక్ష రాసి సోమవారం ఇంటికి చేరుకున్నాడు. ఉదయం ఆన్‌లైన్‌లో మార్కులను పరిశీలించాడు. తనకు తక్కువగా వస్తాయని గ్రహించి మనస్తాపంతో పడుకుంటానని చెప్పి వెళ్లి ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. వస్తువులు పడిపోయిన విషయాన్ని గ్రహించిన తల్లితండ్రులు అటువైపు వెళ్లి చూసే సరికి ఫ్యాన్‌కు ఉగులాడుతూ కనిపించాడు. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉట్నూర్ సీఐ తెలిపారు.

## ఆదివాసుల అభివృద్ధికే సమ్మర్ క్యాంపు

ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, మే 5 : ఆదివాసుల అభివృద్ధి విద్యార్థి దశ నుంచి ప్రారంభం కావాలనే సదుద్దేశంతో ప్రత్యేక సమ్మర్ క్యాంప్ ప్రారంభించామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈ సమ్మర్ క్యాంపు జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ (200), ఇచ్చోడ పోలీస్ స్టేషన్(120), ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్(100), నార్నూర్ (50) పోలీస్ స్టేషన్‌లో ఏకకాలంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. యువత, చిన్నారులు ఒకే అంశంపై పదేపదే శిక్షణ అందించడం ద్వారా వారు ఆ కళలో నిష్ణాతులై ఉన్నత స్థానానికి ఎదుగుతారని తెలిపారు. ముఖ్యంగా ఆటల వల్ల పిల్లలకు, విద్యార్థులకు మానసిక శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. ఈ క్యాంపులో యోగ, కరాటే, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బాస్కెట్ బాల్ నేర్పుతారమ



బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

న్నారు. వీటితోపాటు పోలీస్ స్టేషన్ సందర్శన, నిర్వహణ, జైలు సందర్శన, ఆయుధాల ఉపయోగం, వాటి పనితీరు, జిల్లా పోలీసులు తీసుకున్న కఠోర శిక్షణపై ప్రత్యేకంగా అవగాహన ఉంటుందన్నారు. ప్రత్యేకంగా కరాటే, యోగలను నిష్ణాతులైన పీఈటీలతో ఇప్పిస్తామని తెలిపారు. చిన్నారులతో కలిసి క్రికెట్, వాలీబాల్ ఆడి సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావ్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సిహెచ్ కరుణాకర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, ఎన్.చంద్రశేఖర్, కరాటే మాస్టర్ ప్రవీణ్, యోగ మాస్టర్, పీఈటీ సందీప్ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

## అర్జీలపై అధికారులు నిర్లక్ష్యం చేయద్దు

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 5 ః ప్రజలు సమస్యలపై ఇచ్చే అర్జీలపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం వాటిని పరిష్కరించాలని అధికారులకు అందించారు. పట్టణంలోని వార్డు నంబర్ 20 ఎస్టీ రిజర్వ్ ఉందని, ఇక్కడ 30 ఇండ్లు మంజూరు అయితే ఎస్టీలకు కేవలం నాలుగే ఇండ్లు సర్వేలో మంజూరు చేశారని ఆ కాలనీ మాజీ కౌన్సిలర్ మెస్రం కృష్ణ వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే దీనిపై పూర్తి విచారణ జరిపించి అర్హుల ఎంపికలో లోటుపాట్లు లేకుండా చూడాలని ఫోన్ ద్వారా మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. ప్రభుత్వ పథకాల్లో ఎలాంటి అవినీతి జరిగిన సహించబోమని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై శాఖ పరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ రోజు 147 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి పాల్గొన్నారు.

### మజ్జిగ పంపిణీ..

ఎండా కాలం దృష్ట్యా ప్రజావాణికి వచ్చే ప్రజల కోసం చాంబర్ ఆఫ్ కామర్ ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. కలెక్టర్‌తోపాటు అధికారులకు సీవోసీ తరపున మజ్జిగ అందించారు. ఈ కార్యక్రమంలో సీవోసీ అధ్యక్షుడు దినేశ్‌కుమార్ మటోలియ, ప్రమోద్ కుమార్ ఖత్రి పాల్గొన్నారు.

# సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



అర్జీలు స్వీకరిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, మే 5 : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సర్వే త్వరితగతిన పూర్తి చేసి అర్హులను గుర్తించాలన్నారు. రాజీవ్ యువ వికాసం కింద వచ్చిన దరఖాస్తుల ప్రగతిపై అధికారులతో చర్చించారు. పలు ప్రాంతాల నుంచి టెలిఫోన్ ద్వారా వచ్చిన అర్జీలను స్వీకరించారు.

### భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరుతూ సోమవారం సోన్ మండలంలోని సిద్దులకుంట గ్రామస్తులు భారీ సంఖ్యలో కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. శ్రీరాం సాగర్ జలాశయంలో ముంపునకు గురైన గ్రామంలో భవిష్యత్ అవసరాల కోసం ప్రభుత్వం 23 ఎకరాల మిగులు భూమిని ఉంచిందని తెలిపారు. అయితే కొందరు అక్రమంగా పట్టాలు సృష్టించి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. 2022లో అప్పటి కలెక్టర్ రద్దు చేసినప్పటికి మళ్లీ సాగు చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ స్పందించి పట్టాలను రద్దు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

### విచారణ జరిపించాలి..



ముత్యం రఘు

నకిలీ అంగవైకల్య ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగం పొందిన వ్యక్తిపై విచారణ జరిపించాలని కోరుతూ నేషనల్ హ్యూమన్ రైట్స్, యాంటి కరప్షన్, యాంటి క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యం రఘు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చుంచు శాలిని అనే మహిళ అధికారులను తప్పుదోవ పట్టించి నకిలీ అంగవైకల్య ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగం పొందారని ఆరోపించారు. ప్రస్తుతం ఆమె మామడ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై తాను సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు తీసుకున్నట్లు తెలిపారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

### పాక్ జాతీయులను పంపించాలి..

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ జాతీయులను వెంటనే రాష్ట్రం నుంచి పంపించాలని కలెక్టర్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్ దేశీయుల వీసాలను రద్దు చేసిందన్నారు. కానీ.. హైదరాబాద్‌లో అనేక మంది పాకిస్థాన్ పౌరులు నివసిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ఎందుకు పంపించడం లేదని ప్రశ్నించారు. పాకిస్థాన్ పౌరులను గుర్తించి పాక్‌కు పంపించాలన్నారు.



నిర్మల్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిద్దులకుంట గ్రామస్తులు



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

## సమస్యలను త్వరగా పరిష్కరించాలి

ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, మే 5 : ప్రజా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.15 మంది ఫిర్యాదుదారులు హాజరై సమస్యలను జిల్లా ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఫిర్యాదుదారులపై గౌరవంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించినప్పుడే పోలీసులపై గౌరవం పతక స్థాయికి చేరుకుంటుందన్నారు. సుదూర ప్రాంతాల ఫిర్యాదుదారులు జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకోలేని వారు మెస్సేజ్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో ద్వారా 8712659973 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సంప్రదించాలని తెలిపారు. స్వీకరించిన ఫిర్యాదులలో కుటుంబ తగాదాలు, భార్యాభర్తల మధ్య సమస్యలు, వివిధ కేసుల నమోదుపై ఉన్న సమస్యలపై ఎస్పీకి పలువురు ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ఫిర్యాదుల విభాగం అధికారిణి జైస్వాల్ కవిత పాల్గొన్నారు.